

# అహం

జిల్లేళ్ల బాలాజీ

పరిమళ సిల్క్ ప్యాలెస్...

పట్టణంలోనే అతి పెద్ద పట్టు వస్త్రాలయం. అయిదు అంతస్తుల మేడలో, విశాలమైన గదులతో వచ్చే పోయే కస్టమర్లతో నిండిన ఎస్కలేటర్స్‌తో ఆ షో రూమ్ ఎప్పుడూ కనువిందు చేస్తుంటుంది.

చక్కటి యూనిఫామ్ తొడుక్కొని, పార్సెల్స్ చేత బట్టుకొని అటూ ఇటూ హడావిడిగా తిరిగే హెల్పర్స్, కస్టమర్లను చిరునవ్వుతో ఆహ్వానించి, ఓపికగా వాళ్లు కోరిన బట్టల్ని చూపించటం, అంతే ఓపికతో చిందరవందగా పడున్న బట్టల్ని మడిచిపెట్టే అందమైన సేల్స్ గర్ల్స్. కంప్యూటర్ల ముందు కూర్చొని టకటక బిల్లులు వేసే ఆపరేటర్స్. డబ్బు తీసుకొని మిగతా చిల్లర వాపస్ చేసే క్యాషియర్స్‌తో ఆ షో రూమ్ సదా జనంతో కిట కిటలాడుతుంటుంది.

అలాంటి సిల్క్ ప్యాలెస్ ముందుకు వచ్చి ఆగింది ఓ ఆటో. అందులో నుండి వయ్యారంగా కిందికి దిగింది విలాసిని. పర్స్ తీసి ఆటోవాడికి డబ్బిచ్చి గాగుల్స్ సర్దుకుంటూ, స్టైల్‌గా ముందుకు దారి తీసింది.

విలాసిని తిన్నగా చీరల సెక్షన్‌కి దారి తీసింది. చిరునవ్వుతో ఆమెను ఆహ్వానించి, ఆమె చెప్పిన చీరనల్లా ఓపికగా చూపించింది సేల్స్ గర్ల్.

కానీ ఏ చీరా నచ్చలేదు విలాసినికి. కలర్ నచ్చితే డిజైన్ నచ్చలేదు. డిజైన్ నచ్చితే బోర్డర్ నచ్చలేదు. రెండూ నచ్చితే రేటు అందుబాటులో ఉండటం లేదు. దాంతో చిరాకేసింది విలాసినికి.

విసవిసా మరో సెక్షన్ వైపు దారి తీస్తున్నంతలో... "హాయ్ విలాసినీ...!" అనే పలకరింపుతో పాటు తన భుజం మీద చెయ్యి పడ్డంతో ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూసింది.

ప్రణతి నవ్వుతూ నిలబడుంది. ప్రణతిని చూడగానే ఇట్టే ఆకర్షించేది ఆమె స్వచ్ఛమైన నవ్వే. అయిదున్నర అడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ నాజూకుతనం ఆమె సొత్తు.

విలాసిని తనను గుర్తుపడుతుందో లేదోనని పరీక్షిస్తున్నట్టు నవ్వుతూ నిలబడింది. ఆమె వెనుకగా కారు డ్రైవర్ కాబోలు, చేతిలో బట్టల ప్యాకెట్‌తో నిలబడున్నాడు.

ప్రణతిని వెంటనే గుర్తుపట్టింది విలాసిని. "హాయ్ ప్రణతీ, ఎన్నాళ్లకు కలిశాం? ఎలా ఉన్నావ్? పెళ్లైందా? ఎంత మంది పిల్లలు? మీవారెక్కడ పని చేస్తున్నారు?" అని గుక్క తిప్పుకోకుండా ప్రశ్నించింది.

"ఆగాగు... అన్నీ ఒక్కసారిగా అడిగేస్తే ఎలా?" అంటూ నవ్వి-"నాకు పెళ్లైంది. ఒక బాబు కూడా. వాడిపేరు చరణ్. సెవెన్త్ క్లాస్ చదువుతున్నాడు. ఇక మా వారి పేరు ప్రభాకర్. ఆయన ఎక్కడా పని చెయ్యరు. ఆయన కిందే వందమంది వరకూ పని చేస్తుంటారు. ఎందుకంటే ఆయన ఓ కాంట్రాక్టర్ కనుక..." అని మళ్లీ నవ్వింది ప్రణతి.

ఆ మాటలకు ప్రణతిని గుచ్చిగుచ్చి చూడసాగింది విలాసిని. 'ఆ చిరునవ్వులో ఎంత గర్వం తొంగిచూస్తోంది. ఆమె మాటల్లో

ఎంత అహంకారం తొణికిసలాడుతోంది' అనుకుంటూ తల పక్కకి తిప్పి ముఖం చిట్లించింది విలాసిని.

"ఏమిటీ... చీరలు కొనుక్కోకనే వెళ్లిపోతున్నావ్?" అడిగింది ప్రణతి.

"నాకేదీ నచ్చలేదు ప్రణతీ, నీ సెలక్షన్ అయిపోయుంటే కాస్త నాకు సెలెక్ట్ చేసి పెట్టవూ?" స్నేహితురాలిని అడిగింది విలాసిని.

"ఓ దానికేం భాగ్యం? ఆ సెక్షన్ కెళదాం పద! అక్కడ లేటెస్ట్ వెరైటీలుంటాయి చూద్దాం" అంటూ అటు దారి తీసింది ప్రణతి.

అనుసరించింది విలాసిని.

వాళ్ల వెనుకగా నడిచాడు ప్రణతి కారుడ్రైవర్.

పావు గంట అవీ ఇవీ చూశాక, "ఇది చూడు విలాసినీ, ఎక్సలెంట్ డిజైన్, అట్రాక్టివ్ కలర్..." అని సేల్స్ గర్ల్ వైపు తిరిగి "దీని రేటెంత?" అని ప్రశ్నించింది ప్రణతి.

"ఎంత మేడమ్, జస్ట్ ఫైవ్ థౌజండ్ సెవెన్ హండ్రెడ్స్ ఓన్లీ..." చీర కొసన ఉన్న ట్యాగ్‌ను చూసి బదులిచ్చింది సేల్స్ గర్ల్.

"హౌ నైస్! ఇటీజ్ చాలా బావుంది కదూ. నాకు ఎంతగానో నచ్చింది.." అని మళ్లీ సేల్స్ గర్ల్ వైపు తిరిగి "ఇదే డిజైన్ ఆరెంజ్ కలర్‌లో ఉంటే పట్టుకురా. నాకు ఆ కలర్ అయితేనే బావుంటుం ది" ఉత్సాహంగా అంది ప్రణతి.

'తనకు చీర సెలెక్ట్ చెయ్యమంటే తను సెలెక్ట్ చేసుకుందేమిటీ? అంటే ఇంతసేపూ తన కోసం చీరలు చూళ్లేదన్న మాట...!' మనసులోనే ఉడికిపోయింది విలాసిని.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఏ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

"ఏం విలాసినీ, నీకు నచ్చలేదా ఈ చీర?"

విలాసిని ఆ చీరను అటూ ఇటూ తిప్పి చూసింది కానీ పెద్దగా ఆసక్తిని చూపలేకపోయింది.

"ఏం, ఈ చీర బాలేదా?" మళ్లీ అడిగింది ప్రణతి.

"అబ్బే అదేం కాదు, చీర బాగానే ఉంది కానీ... రేట్ కాస్త ఎక్కువ."

"రేట్ చూస్తే ఎలా? మనసుకు నచ్చింది కట్టుకోవాలనుకుంటే రేట్‌ను పట్టించుకోకూడదు. ఇంత బావున్న చీర అంత రేట్‌లోనే ఉంటుంది. ఇక్కడన్నీ కాస్ట్లీనే మరి..." చీర నాణ్యతను చూస్తూ అంది ప్రణతి.

'అంటే ఆ షాప్ గురించి తనకే మాత్రం తెలియదనీ, తాను పొరపాటున ఆ షాప్‌కు వచ్చాననీ ప్రణతి అనుకుంటోందా? తాను రేట్‌ను చూసి, వెనకాడటాన్ని గమనించి ఎంత చులకనగా మాట్లాడుతోంది...!' చిరాగ్గా ముఖం పక్కకు తిప్పుకుంది విలాసిని.

ఇంతలో సేల్స్ గర్ల్ ఆరెంజ్ రంగు చీరను పట్టుకొచ్చింది.

"ఓ సారి చీర మొత్తం విప్పి చూపించూ" అంది ప్రణతి.

"మా దగ్గర డ్యామేజ్డ్ ఐటమ్స్ ఏవీ ఉండవు మేడమ్" అంటూ సేల్స్ గర్ల్ చీర మడతలు విప్పి చూపిస్తుంటే "వావ్! బ్యూటిఫుల్! వెరీ నైస్..." అని పదే పదే ఆ చీరను పొగడసాగింది ప్రణతి.

"మీకు ఈ శారీ చాలా బావుంటుంది మేడమ్. మీ పర్సనాలిటీకి తగిన చీర మేడమ్..." సేల్స్ గర్ల్ ప్రణతిని పొగుడుతుంటే ముఖం చిట్లించింది విలాసిని.

"ఓకే ఓకే ఇక ఆపు! ముందు దీన్ని ప్యాక్ చెయ్" సంతృప్తిగా నవ్వుతూ అంది ప్రణతి.

విలాసినికి, ప్రణతి మీద పట్టరాని కోపం ముంచు కొచ్చింది. 'తన ముందు ఎంత టెక్కు చూపుతోంది? రేట్‌ను గురించి పట్టించుకోకూడదనుకుంటూనే దాన్ని కొందంటే ఏమిటర్థం? తనకు ఆ రేట్‌లో శారీ స్థాయి లేదని అర్థమా? లేదూ... దానికి ఆ స్థాయి ఉందని భావమా? ఎంత అహంకారం? తనను అవమాన పరచటానికే ఆ శారీని కొన్నట్టుంది...' అవమానంతో దహించుకు పోసాగింది విలాసిని.

"మీ షాప్‌లో క్రెడిట్ కార్డ్ యాక్సెప్ట్ చేస్తారా?" సేల్స్ గర్ల్‌ను ప్రశ్నించింది ప్రణతి.

"చేస్తారు మేడమ్..."

అంతలో సెల్ ఫోన్ మోగటంతో, హ్యాండ్ బ్యాగ్ జిప్ తీసి సెల్‌ను బయటికి తీసి, ఎవరు చేశారో గమనించి, "జస్ట్ ఎ మినిట్..." అని విలాసినితో అని, కాస్త పక్కగా వెళ్లి మాట్లాడ సాగింది ప్రణతి.

'ఎంత వగలు పోతోంది! తనొక్కదాని దగ్గరే క్రెడిట్ కార్డ్, సెల ఫోన్ ఉన్నట్టు ఎంత పోజు కొడుతోంది! తను ఉన్నదాన్నని నాకు తెలియాలని ఎంత డాంభికాన్ని ప్రదర్శిస్తోంది! చెబుతా చెబుతా... దీని పని చెబుతా...' అనుకుంటూ పళ్లు కొరుక్కుంది విలాసిని.

సెల్‌లో మాట్లాడి దగ్గరకు వచ్చిన ప్రణతి. "వెంటనే వెళ్లాలి విలాసినీ! ఆయన దగ్గర నుండే కాల్. థాంక్ గాడ్, వస్తూ వస్తూ క్రెడిట్ కార్డ్ తీసుకురావడం ఎంత మంచిదైంది! లేకపోతే ఈ శారీ కోసం మళ్లీ రావలసి వచ్చేది" అంటూ పర్స్‌లో నుండి తన విజిటింగ్ కార్డు తీసి విలాసిని చేతికిస్తూ, "ఇది నా విజిటింగ్ కార్డు. వీలు చూసుకొని రా. సరదాగా కాలక్షేపం చేద్దాం! ఓకే... బై..." అని చెయ్యి ఊపి బయటికి దారి తీసింది ప్రణతి. ఆమెను అనుసరించాడు కారు డ్రైవర్.

చేతిలోని ప్రణతి విజిటింగ్ కార్డ్‌ను కేర్‌లెస్‌గా చూసింది విలాసిని. 'అణుస్తా అణుస్తా. దీని పొగరు అణుస్తా. దీనికి తిక్క కుదిరేటట్టు చెయ్యకపోతే తన పేరు విలాసిని కాదు!' అని నిర్ణయించుకొని, "ఆఁ చూడూ, ఈ డిజైన్‌లోనే ఆరెంజ్ కలర్‌లో ఇంకా చీరలు న్నాయి కదూ?!" సేల్స్ గర్ల్‌ని అడిగింది విలాసిని.

"ఉన్నాయి మేడమ్. ఇంకోటి తెమ్మంటారా?"

"ఒకటి కాదు, రెండు చీరలు తీసుకురా!" బదులిచ్చింది విలాసిని.

ఆమె వంక ఆశ్చర్యంగా చూసింది సేల్ గర్ల్.

**000**

"హల్లో... ఎవరూ?

"ప్రణతీ, నేను విలాసినిని మాట్లాడుతున్నాను!"

"హాయ్ విలాసినీ... హౌ ఆర్ యూ?"

"బానే ఉన్నాను! ఇవ్వాళ సాయంత్రం నువ్వు మా ఇంటికి వస్తున్నావ్!!"

"ఏమిటి విశేషం?"

"ఇవ్వాళ నా పుట్టిన రోజు!"

"వావ్, కంగ్రాచ్యులేషన్స్. మెనీ మోర్ హ్యాపీ రిటర్న్స్ ఆఫ ద డే."

"నో నో, ఫోన్‌లో కాదు! ఓ చిన్న ఫంక్షన్ ఏర్పాటు చేశాను మా ఇంట్లోనే. నువ్వే చీఫ్ గెస్ట్‌వి. కొంతమందినే ఆహ్వానించాను."

"రియల్లీ? అయితే డెఫినెట్‌గా వస్తాను. ఓకే!"

"థ్యాంక్యూ! మరో విషయం, ఆ రోజు నువ్వు 'పరిమళ'లో కొన్నావు చూడూ, కొత్త చీర... అదే నీకు నచ్చిన ఆరెంజ్ కలర్

చీర, దాన్ని నువ్వు కట్టుకురావాలి."

"బాగా గుర్తుపెట్టుకున్నావు సుమా నువ్వు! అలాగే కట్టుకొస్తాలే."

"మరిచిపోకు-సాయంత్రం ఆరింటికి ఫంక్షన్."

"ష్యూర్... ష్యూర్..."

ఫోన్ క్రెడిల్ చేసి కసిగా పెదాలు కొరికింది విలాసిని.

**000**

సరిగ్గా ఆరు గంటలకు...

విలాసిని ఇంటి ముందు కారు దిగింది ప్రణతి. చీరను సర్దుకుంటూ తలెత్తి ముందుకు చూసింది.

అక్కడ ఫంక్షన్ ఏర్పాట్లు చేసిన ఆన వాళ్లేవీ కనిపించలేదు ఆమెకు. కానీ విలాసిని ఇంట్లో నుండి చాలా మంది ఆడవాళ్ల గొంతులు గలగలమని వినిపించాయి.

అడుగులు ముందుకు వేసింది ప్రణతి.

"ఔనూ, విలాసిని బర్త్ డే ఏప్రిల్‌లో జరుపుకుంది కదా? మళ్లీ ఇప్పుడు జూలైలో జరుపుకుంటోందేమిటీ?"

"అదే నాకూ అర్థం కావటం లేదు. ఏడాదికి రెండుసార్లు జరుపుకునే ఆనవాయితీ మొదలుపెట్టిందో, ఏమో?" పకపకమని నవ్వుకుంటూ ఇద్దరు ఆడవాళ్లు మాట్లాడిన మాటలు ప్రణతి చెవిన పడ్డాయి. దాని గురించే ఆలోచిస్తూ ఇంట్లోపలికి అడుగు పెట్టింది.

ఆమెను చూడగానే ఎందుకో అక్కడున్న వాళ్లందరూ మాటలు ఆపేశారు.

"రా రా. నీ కోసమే ఎదురు చూస్తున్నా. డియర్ ఫ్రెండ్స్! షి ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్ అండ్ కాలేజ్ మేట్. మిసెస్ ప్రణతీభాస్కర్. ఈ రోజుటి చీఫ్ గెస్ట్. నా స్నేహితురాలికి కాస్త చోటిస్తారా?" అంటూ సోఫాలో కూర్చున్నవాళ్ల లోంచి ఇద్దర్ని లేపింది విలాసిని.

అంతే! సోఫాకేసి చూసి షాక్ తింది ప్రణతి. సోఫాకు వేసిన కవర్‌నూ, ప్రణతి కట్టుకున్న చీరనూ చూసి అక్కడున్న ఆడవాళ్లందరూ కవర్‌నూ, ప్రణతి కట్టుకున్న చీరనూ చూసి అక్కడున్న వాళ్లందరూ నవ్వాపుకోలేకపోయారు.

తల తీసేసినట్టయింది ప్రణతికి.

"ఒసేయ్ మంగా! ఆ కాఫీ ట్రేను ఇలా పట్టుకురావే!" పనిమనిషిని కేక పెట్టింది విలాసిని.

కాఫీ పట్టుకొచ్చిన పనిమనిషిని చూసి అవమానంతో బిగుసుకుపోయింది ప్రణతి. పంటి బిగువున కోపాన్ని అణుచుకుంటూ వంచిన తలతో వడివడిగా బయటికి నడిచింది.

"కాఫీ కప్పుల్ని అక్కడ పెట్టి గుమ్మాని కున్న కర్టెన్‌ను దించు" పనిమనిషిని పురమాయించింది విలాసిని.

కారు డోర్ తీసి కార్లో కూర్చుంటూ విలాసిని ఇంటికేసి చూసింది ప్రణతి. ఆ ఇంటి గుమ్మానికి వ్రేలాడదీసిన ఆరెంజ్ కలర్ కర్టెన్ గాలికి ఊగిసలాడసాగింది.

'డామిట్! ఇంటికి పిలిచి మరీ అవమానిస్తుందా? ఇక ఎప్పటికీ దాని ముఖం చూడకూడదు! అయినా దాని బుద్ధి తెలిసి కూడా దానింటికి రావటం తన తప్పే! అది మారి ఉంటుందను కోవటం తన పొరపాటే. ఇంకా దానికున్న ఆ న్యూనతాభావం వదిలిపోయినట్టు లేదు! చిన్న చిన్న విషయాలకు తీవ్రంగా స్పందించటం, తానే గొప్పదాన్నన్న విషయాన్ని నలుగురి ముందూ నిరూపించుకునేంతవరకూ దానికి నిద్ర పట్టకపోవటం... ఛ్ఛ్! ఎప్పుడు మారుతుందో ఏమిటో! దాన్ని భగవంతుడే దాన్ని మార్చాలి' కారును డ్రైవ్ చేస్తూ మనసులోనే అనుకుంది ప్రణతి.

"దాని తిక్క కుదిర్చాను చూశారా... లేదంటే నాతో పెట్టుకుంటుందా? నా ఇంటి పనిమనిషి కట్టుకున్న చీర లాంటిదే అదీ కట్టుకుంది. ఇంకెక్కడ దాని గొప్పతనం? నా దగ్గరా దాని పోజులు!" విలాసిని అన్న మాటలతో అక్కడున్న వాళ్లందరూ పగలపడి నవ్వారు.

**000**

గబుక్కున మెలకువ వచ్చింది విలాసినికి. కదలకుండా అలాగే పడుకుని జాగ్రత్తగా వింది, ఆ శబ్దాలను.

ఎవరో గుమ్మం బయట తలుపును తియ్యటానికి ప్రయత్నిస్తున్నారు.

ఒక్కసారిగా ఒళ్లు జల్లుమంది ఆమెకు. తల తిప్పి గోడ గడియారంకేసి చూసింది. ఒంటి గంట కావస్తోంది. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

సమయానికి ఆమె భర్త కూడా ఊళ్లో లేడు. నాలుగు రోజుల క్రితం అతను ఆఫీసు పని మీద చిత్తూరుకు వెళ్లాడు. ఇంకా రెండు-మూడు రోజుల దాకా రాడు.

గుమ్మం వద్ద శబ్దాలు తీవ్రమయ్యాయి. ఏం చెయ్యాలో తోచలేదు విలాసినికి.

మంచం పై నుండి కిందికి దిగి అడుగులో అడుగు వేస్తూ తలుపు దగ్గరికి వెళ్లింది. బయటి నుండి ఏవైనా గుసగుసలు వినిపిస్తాయేమోనని చెవి ఆనించి వింది. కానీ అటువంటిదేమీ వినిపించలేదు ఆమెకు. అసలు బయట ఏం జరుగుతోందో అర్థం కాలేదు విలాసినికి.

గట్టిగా అరుద్దామనుకుంది కానీ, ఆ సమయంలో అందరూ గాఢనిద్రలో ఉంటారనీ, అరచి గీపెట్టినా, ప్రయోజనం ఉండదనీ భావించి మౌనంగా ఉండిపోయింది. వెనక్కొచ్చి బెడ్‌పై పడుకొని తన ఇద్దరు పిల్లల్నీ దగ్గరగా తీసుకుంది. ఏం జరిగినా తలుపు మాత్రం తీయకూడదని నిర్ణయించుకుంది.

కాసేపటికి ఆ శబ్దాలు ఆగిపోయాయి. అయినా ధైర్యంగా వెళ్లి తలుపు తీయలేకపోయింది. అలాగే పిల్లల మధ్య ఒదిగి పడుకుని ఉండిపోయింది.

బిక్కుబిక్కుమంటూ ఆ రాత్రంతా కంటి మీద రెప్ప వెయ్యకుండా గడిపింది.

తెలతెలవారుతుండగా, బయట మనుషులు తిరుగుతున్న శబ్దాలు వినగానే ప్రాణం లేచి వచ్చింది విలాసినికి.

లేచి గబగబ వెళ్లి తలుపు తీసింది. గుమ్మం వద్ద పరిశీలనగా చూసి ఆశ్చర్యపోయింది.

గుమ్మానికి వేలాడదీసిన కర్టెన్ గుడ్డ మాయమైంది! రాత్రి వచ్చిన ఆగంతకుడెవరో కర్టెన్ గుడ్డను దొంగిలించుకుపోయాడు. పైభాగం అందలేదేమో... తీయడానికి వీలు కాక బ్లేడ్‌తో కోసినట్టు స్పష్టంగా కనిపిస్తోంది!

'కేవలం కర్టెన్ గుడ్డ కోసమా రాత్రి దొంగతనానికి వచ్చాడు? అయి ఉండదు! ఎవరో అతణ్ని ఆ పనికి ఉసిగొలిపి ఉండాలి. ఎవరేమిటీ, ఇది కచ్చితంగా ఆ వగలాడి ప్రణతి పనే అయి ఉంటుంది. ధైర్యంగా తన ముందు ఏమీ చెయ్యలేక ఇలా తెరచాటుగా తన మీద కక్ష సాధించిందన్న మాట! అది అంత కన్నా ఇంకేం చెయ్యగలుగుతుంది? తెరచాటుగా ఉండి తనకు నష్టం చెయ్యగలుగుతుందేమో గానీ తన ముందు తలెత్తుకు తిరిగే ధైర్యం దానికి ఎక్కడిదీ? చుప్పనాతి మొహమూ, అదీనూ! అది మళ్లీ తనకు తారసపడకపోతుందా? అప్పుడు చెబుతా దాని పని!' అని విలాసిని గట్టిగా నిర్ణయించుకుంది కానీ మూడు నెలలైనా విలాసినికి ప్రణతి తారసపడనే లేదు.

**000**

ఓ రోజు...

మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉంది. చల్లని గాలులు వీస్తున్నాయి. సన్నటి తుంపర మొదలైంది.

ఆ సమయంలో–

"అమ్మా... ఇంత అన్నం ఉంటే పెట్టు తల్లీ..." అంటూ బయట ఎవరో ముసల్ది అడుక్కుంటోంది, వణుకుతున్న గొంతుతో.

భోజనం చేసి టీవీలో సినిమా చూస్తున్న విలాసినికి ఆ అరుపులు చికాకు కలిగించాయి. నుదురు చిట్లించి సినిమాపై మనసు లగ్నం చెయ్యటానికి ప్రయత్నిం చింది.

"అమ్మా... ఆకలేస్తోంది తల్లీ. పుణ్యం ఉంటుంది ఇంత అన్నం పెట్టమ్మా..."

ఆ దీనురాలి అరుపులకు వొళ్లు మండిపోయింది విలాసినికి. స్తిమితంగా సినిమా చూడనివ్వని ముసలిదాన్ని తన్ని తగలెయ్యా లన్నంత కసి పుట్టుకొచ్చింది ఆమెలో.

లేచి విసవిసా బయటికెళ్లింది. ఆ ముసలిదాన్ని కసిరి తరిమికొట్టాలని!

కానీ, బయటికెళ్లి ఎదురుగా కనిపించిన ముసలిదాన్ని చూసి ఆశ్చర్యపోయింది విలాసిని.

ఆ ముసల్ది–ఓ సత్తు పళ్లేన్ని ముందుకు చాపి అడుక్కుంటోంది. కళ్లు సరిగ్గా కనిపి స్తున్నట్లు లేదు. కనురెప్పలు టపటపలాడిస్తూ వోరకంటితో చూస్తూ అరుస్తోంది. బక్కచిక్కి ఉంది. తైలసంస్కారం లేక తల ముగ్గుబుట్టలా ఉంది. చర్మం ముడతలు పడుంది. ఛాతీ పైన అచ్ఛాదనగా జాకెట్ ధరించినట్టు లేదు. కానీ ఒంటికి ఓ పాత చీరను చుట్టుకుని ఉంది.

విలాసిని ఆశ్చర్యానికి ఆ చీరే కారణం! చీర రంగు వెలిసిపోయి ఉంది. రంగు మాసిపోయినా, దానికున్న డిజైన్ మాత్రం విలాసినికి ఎరుకే!

'తనింట్లో దొంతగనం జరిగిన చీరలా ఉంది.ఇది అదేనా? లేకపోతే ప్రణతి ఇష్టపడి కొనుకున్న చీరలాంటిదే, తనింటి పనిమనిషి కట్టుకుందన్న అక్కసుతో ఆ వగలాడే ఈ ముసల్దానికి ఈ చీరను దానం చేసేసిందా? ఇందులో ఏది నిజం? తేల్చుకోవాలనుకుంది.

తుంపర చిరుజల్లుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. గాలులు బలంగా వీస్తు న్నాయి. అంతకంతకూ మేఘాలు కమ్ము కోసాగాయి.

"అన్నం పెడతా గానీ, లోపలికి రా..." అంటూ ఆ బిచ్చగత్తెను ఇంట్లోపలికి ఆహ్వానించింది విలాసిని.

ఆ ముసల్దానికి ఏమీ అర్థం గాక అలాగే వీధిలోనే నిలబడిపోయి విలాసిని గుచ్చి గుచ్చి చూడసాగింది.

కళ్లే కాదు. దీనికి చెవులూ వినబడేట్టు లేదు. అనుకొని గొంతు పెంచి "తడుస్తావు. లోపలికి రా. అన్నం పెడతాను" అని మళ్లీ పిలిచింది విలాసిని.

మెల్లగా ఒక్కో మెట్టూ ఎక్కి ఇంట్లోపలికి అడుగు పెట్టింది ఆ దీనురాలు.

"అక్కడ కూర్చో. అన్నం తెస్తా..." అంటూ వంట ఇంట్లోకి వెళ్లింది విలాసిని.

నేల మీద గొంతు కూర్చుని బిక్కుబిక్కు మంటూ దిక్కులు చూడసాగింది ఆ ముసల్ది.

ఓ పళ్లెంలో అన్నం, దాని మీద ఇంత కూరా వేసుకుని పట్టుకొచ్చింది విలాసిని.

హాల్లో దీనంగా చూస్తున్న ముసలిదాన్ని ఓ క్షణం తేరిపార చూసింది.

"ఏయ్ ముసల్దానా, ఆ సోఫాకున్న కవరూ, ఆ కిటికీలకు కట్టిన తెరలూ ఓ సారి బాగా చూడూ, నీకేమైనా గుర్తు కొస్తుందేమో చూద్దాం" విచారణ మొదలుపెట్టింది విలాసిని.

ఆమె ఏం అంటున్నదో అర్థం కాక, వాటికేసి కళ్లు చికిలించి చూడ్డానికి ప్రయత్నించింది ఆ ముసల్ది.

"ఏం? గుర్తుకు రావటం లేదా? పోనీ ఈ విషయం చెప్పు నీ ఒంటి మీదున్న చీర ఎక్కడిది? ఎవరైనా ఇచ్చారా? లేక ఎక్కడైనా దొంగిలించావా?" కఠినంగా అడిగింది విలాసిని.

ఆ మాటలతో గతుక్కుమంది ముసల్ది.

ఉన్నట్టుండి ఆకాశంలో ఓ మెరుపు మెరిసింది. ఆ వెంటనే ఎక్కడో ఫెళఫెళ మంటూ శబ్దం చేస్తూ పిడుగు పడింది. వాన మొదలైంది.

"నిజం చెప్పకపోయావో... నిన్ను పోలీసులకు పట్టిస్తాను. మర్యాదగా నిజం చెప్పు!" బెదిరించింది విలాసిని.

భయంభయంగా విలాసిని ముఖంలోకి చూసింది ఆ బిచ్చగత్తె.

"దాన్ని ఎంత వెల పెట్టి కొన్నానో తెలుసా? అక్షరాలా పదివేల రూపాయల పైనే! అంత ఖరీదైన గుడ్డను దొంగిలించుకుపోతావా? పోలీసులకు ఫిర్యాదు చేశానంటే ఆర్నెల్లు జైల్లో పెడతారు నిన్ను. అక్కడ కుక్క బతుకే నీది! మర్యాదగా నిజం చెప్పు, నువ్వే కదూ దొంగిలించావ్?" కళ్లెర్ర చేస్తూ ముసలిదాన్ని దబాయించింది విలాసిని.

సన్నగా వణుకు మొదలైంది ముసలి దానిలో. ఏమీ చెప్పాలో తెలియక గుటకలు మింగుతూ మంచి నీళ్లు కావాలన్నట్టు సైగ చేసింది.

అన్నం పళ్లేన్ని టీపాయ్ మీద పెట్టి మంచి నీళ్లు తేవటానికి వంట గదిలోకి వెళ్లింది విలాసిని.

మెల్లగా లేచి నిలబడింది బిచ్చగత్తె. తన ఒంటికి చుట్టుకున్న చీరను విప్పదీసింది. దాన్ని ఉండగా చుట్టి అక్కడున్న సోఫా మీద భద్రంగా పెట్టింది. తన సత్తు పళ్లేన్ని అందుకొని బయటకు దారి తీసింది.

బయట వర్షం కురుస్తోంది.

ఒంటి మీద అచ్ఛాదన లేని ఆ పండు ముదుసలి అలాగే నగ్నంగా నడుచుకుం టూ వెళ్లి పోతోంది.

మంచి నీళ్ల గ్లాసుతో హాల్లోకి వచ్చిన విలాసినికి అక్కడ బిచ్చగత్తె కనిపించ లేదు. కానీ ఆమె చుట్టుకున్న ఆ చీర సోఫా మీద కనిపించింది.

బ్లేడుతో కోసినట్టున్న చీర కొన భాగం ఫ్యాను గాలికి రెపరెపలాడుతూ కనిపిం చింది.

క్షణాలలో విషయం అర్థమైపోయింది విలాసినికి.

'ఎటెళ్లిందీ ముసల్ది?' గుమ్మం వద్దకొచ్చి వీధిలోకి చూసింది.

అల్లంత దూరంలో... నగ్నంగా వర్షంలో తడుస్తూ నడిచి వెళ్తున్న ఆ ముసలి బిచ్చగత్తె కనిపించింది.

వెళుతున్నదల్లా రోడ్డు పక్కగా కనిపించిన మునిసిపాలిటి చెత్తకుండీ వద్దకు వెళ్లింది. వంగి అందులోని చెత్తను అటూ ఇటూ కెలికింది. ఆమె చేతికి ఏదో చిక్కింది. దాన్ని బయటకి తీసింది.

అక్కడక్కడా చిరిగిన ఓ పాత గోనె సంచి అది! దానికి అంటుకుని ఉన్న చెత్తను విదిలించి, అలాగే తన నడుము కు చుట్టుకుంది.

జోరున కురుస్తున్న వర్షంలో తడుస్తూ. దొరికిన ఆ కాస్త అచ్ఛాదనతో. నిశ్చలం గా నిర్భయంగా నడుచుకుంటూ వెళుతు న్నది ఆ బిచ్చగత్తె!

ఉవ్వెత్తున్న ఎగసిపడిన ఆలోచనల కెరటాలు తనను నిలువెల్లా ముం చేస్తుంటే. ఉక్కిరిబిక్కిరైపోయి. ఆ ముసలి దాన్ని అలాగే చూస్తూ ఉండిపోయింది విలాసిని!